వీణాధరి ఆది

నవ్వువచ్చీ నిన్ను జూచి - నాకు నేడు యీ
రవ్వలు నీకేచెల్లు - రాజసపు దేవుడా

సతికుచముల మోవ - సాము జేసినటు వలె
సతముగా మోచేవు - శంఖ చక్రములు
మతకాన వేడుకొనే - మార్గమున నున్నట్లు
తతి నభయహస్తము - తప్పవు నీవిపుడు

కామిని నలమిపట్టే - గతి యలవాటుగా
యేమరపు కటిహస్త - మెంతైనా నీవు
నేమాననామెరాక - నిక్కిచూచే మతకాన
కోమలపు నీకునిల్వు - కొలువులే యిపుడు

అంకె వుపరి సురత - మలవాటు చెడకుండా
ఉంకువ శ్రీసతి - మోచే పురమున
అంకి శ్రీవేంకటాద్రి - నంది మమ్ముగాచేటి
పొంకపు మన్ననల చూపులు జల్లేవిదిగో ॥

అన్నమాచార్యులకు స్వామితో ఉన్న చనువు అపారమైనది. వారుభయులూ ప్రాణమిత్రులు. ఆ చనువుని, ఆ మైత్రిని పురస్కరించుకొని అన్నమాచార్యులు స్వామితో ఆడిన పరిహాసం ఆలకించిన శ్రీవేంకటేశ్వరుని దరహాసం ఈ సంకీర్తనలో నిక్షిప్తమైనది.

ఏమయ్యా ఎల్లప్పుడు ఈ శంఖచక్రములు మోస్తునే ఉంటావు. సతికుచముల ముద్రలు నీపై పడేటందుకు సాము చేస్తున్నట్లుగా (శంఖచక్రములు నీకు సహజ సిద్ధమైనవి. సతికుచముద్రలు సహజమైనవి కావు కదా. అందుకై సాము చేస్తున్నట్లు శంఖచక్రాల మోత) కుచముద్రల సిద్ధికై ఆమెను వేడుకుంటూ ఉన్నట్లు అభయహస్తం తప్పవుకదా.

నీకు నీ సతిని పొదివి పట్టుకొనడం అలవాటయి ఆమె లేనప్పుడు కూడా ఆమెను పొదివి పట్టే భంగనులోనే నీ కటిహస్తం మానడం లేదు నీవు. ఆమెరాక కోసం నిరీక్షిస్తూ నిక్కిచూడడం అలవాటై కోమలమైన నీకు పాపం నిల్వు కొలువులయ్యాయి. నిల్చునేఉంటావెప్పడూ.

నీవు నిలబడితే ఉండిపోతే ప్రియాప్రియక్రియాధీనుడైన నీకు ప్రియమైన పుంభావ రతి ఎలాగ? ఆ అలవాటు తప్పకుండా నీవు శ్రీదేవిని గుండెలపై (ఆన్వర్థ సంజ్ఞగా) మోస్తున్నావు. ఇదిగోనామాటనిజమని ఒప్పుకుంటున్నావు. శ్రీవేంకటాద్రిపైనుండి మమ్ము రక్షించేటి (నన్నూ నావాళ్లనీ నా ఈ సంకీర్తన చదివే వినే వాళ్లందరినీ రక్షించే) అందపు సెలవి నవ్వుల మన్ననల చూపులు జల్లుతున్నావు. ఈరవ్వరట్టులు రాజసపుదేవుడవు గదా నీకే చెల్లినవి. నాకు నిన్ను చూస్తే నవ్వు వస్తోంది. అంటూ అన్నమాచార్యులు స్వామితో ప్రియసరసచతుర సంభాషణ మొనర్చారు.